# కథ వ్రాయడం

ఆ రోజు. ఆదివారము కావడంవల్ల భోజనాలు త్వరగా అయ్యాయి నేను గదిలో కుర్చీమీద కూర్చున్నాను ఎదురుగానున్న బల్లమీద నాలుగు తెల్లకాగితాలు, కలము, సిరాబుడ్డీ ఉన్నాయి. గ్రామఫోన్ ప్లేట్లిచ్చిన వనితారత్నాల ఫుటోలుకొన్ని గోడను వ్రేల్లాడుతున్నాయి. నా ప్రక్కనున్న ఉయ్యాలలో మాఅబ్బాయి ఊగుతున్నాడు. గోడనున్న గంటల గడియారము లోపల 'మినిటు హేండు' మాత్రము 'క్వెల్వ్ యార్డ్సు' పందెములో గబగబా పనిచేస్తోంది. ఆయాసంచేత దానికికల్గిన వగర్పు తక్క గదిఅంతా నిశ్శబ్దం. శాంతరసం అంతటా ఆవరించింది. నే నెల్లాగో చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాను.

కొంతసేపటికి నారాజ్యం,

'ఎంతసే పాలోచన ? కాగితాలు కలము ఉంటేసరి మేమెవరం కనపడం అప్పుడప్పుడు గోడలమీద బొమ్మలు తక్క' అంది నెమ్మదిగా.

నేను నిజంగా సిగ్గుపడ్డాను. కాని అల్లాటి మాటలు నాకు తగలడం యిది తొంబదితొమ్మిదో పర్యాయం.

'నీ బాధ పడలేకుండావున్నాను. రేపు నీ చిత్రంకూడా అక్కడ తగిలిస్తానులే' అంటూ ప్రక్కకితిరిగిచూచాను. రాజ్యం ఉయ్యాలమీద ఆనుకుని చేతిలో తమలపాకులు పట్టుకుని నిలబడివుంది, ఎంతసేపటినుంచో.

'ఏమిటా ఆలోచన !' అందిరాజ్యం మళ్ళీ.

'సువర్ణలేఖకు ఏంకథవ్రాద్దామా అని' అన్నాను తమలపాకులు అందుకుంటూ.

'నే జెప్పనా ?'

'ఇంకేంకావాలి '

'భీముని బలపరాక్రమాలు'

'నీ సౌందర్యమువలెనే అనన్యసామాన్యమైనప్పటికి ప్రజలు అతిశయోక్తి అంటారు.'

'దమయంతి కష్టాలు'

'నేటి భారతనారీమణులకు ఆశ్చర్యంకలిగించ లేవు, జాలి బుట్టించ లేవు.'

'శివాజీ పౌరుషోదంతాలు'

'ఎడతెరపిలేకుండా పాడి కవికుమారులు విసిగెత్తివున్నారు.'

'అక్బరు పరమత సహిష్ణత !'

'వెయినోళ్ళ కీర్తించవలసిందే కాని యిప్పటివాళ్ళలో మతంకొఱకు దేవుల్లాడేవారు తక్కువ. మాకు ఏ మతమైనా సరే ఏదోఒకటి ఉండడం కావలసింది అంటారు.'

'బాల్యవివాహాలు వద్దని' అంది రాజ్యం సందేహిస్తూ.

'శారదా చట్టముండగా వాటి అవసరమేమిటి ?'

'పోనీ గయ్యాళిభార్యనుకూర్చి వ్రాస్తే'

'బాగానే వుంటుంది కాని మాయ ప్రపంచం ఆలోచించకుండా వ్రాసినవాడి స్థితియిదంతా' అంటుంది.'

నేను తాంబూలంవేయడం సమాప్తమైంది. రాజ్యం మెల్లిగా మంచంమీద ప్రవేశించింది.

'ఇన్ని చెప్పినా మీకు నచ్చకపోయాక నేనేమి చేసేది ? ఇక రేపు ఆలోచింతురుగాని

యీవాళటికి కట్టిపెట్టండి'

'సరే యీవాళటికి ఆలోచించడం రేపు వ్రాయడం' అంటూ రాజ్యం ప్రక్కన కూర్చున్నా.

'ఇన్నికధలు వ్రాస్తారు ఏంలాభం? ఆడదాని మనసులోని సంక్షోభం తెలిసికోలేక పోయాక! మేం మాత్రం మీ చూపుల్లోని భావాలు తెలిసి ప్రవర్తించకపోతే బయలు వెడలుతాయి ధుమధుమలు, అన్యాపదేశాలూను' అంది రాజ్యం కణతలు రెండూ రెండుచేతుల్తోనూ పట్టుకుని.

నా రాజ్యంమాటలు నా భావాలిని రేపాయి. నవ్వొచ్చి తన కోమలకరపల్లవాలతో మనోహరవదనాన్ని మూసివై చికొందని ఆ రెండుచేతులు పట్టుకుని క్రిందికిలాగాను. కాని రాజ్యం పెదవులమీద చిరునవ్వైనా లేదు. కళ్లు ఎఱ్ఱపడ్డాయి. ముఖం మీద ఏదోబాధ పొడగట్టుతోంది నేను సందేహంతో

'తలకాయనొప్పిగావుందా' అని ప్రశ్నించాను. రాజ్యం తలవూపింది ఔనన్నట్టుగా.

'అమృతాంజనం రుద్దనా?'

'ఎన్నిరుద్దకుండా మీతో చెప్పలా! మీకుమల్లే!' అంది రాజ్యం చురుకుగా.

'ఎప్పటినుంచి ఉంది యీబాధ' అన్నాను ఏమిటో.

'రోజూ రాత్రి ఉంటూంటుంది' అంది నవ్వుతూ.

నాలోఏమిటో విద్యుత్ప్రసారం అయింది.

'కారణం?' అన్నాను వెంటనే.

'కారణం చెప్పనా?'

'ఊఁ'

'కోపపడననండి'

అల్లాగే అన్నాను.

'మీరు తీరుబడిగా వున్న కాస్సేపూ పనికిమాలినకధలు వ్రాయకపోతే...'అని ఆగింది రాజ్యం. నాకు నిజంగా కోపంవచ్చింది. కాని కోపపడనని మాటయిచ్చాను. కనుక కోపపడినట్టు తెలియకుండా ఒకవాడి నారాచం ప్రయోగిద్దామని 'ఆవాళ్ళకి ఎంత సేపూ కావలిసింది అదొక్కటే' అన్నా, హేళనగా.

అంతలో పిల్లాడు లేచి ఏడుపు ప్రారంభించాడు. రాజ్యం నాకేసి తీక్ష్ణదృష్టులతో చూస్తోంది. నేనేదో మంత్రముగ్ధుడనైపోయి మెల్లిగా ఉయ్యాలదగ్గరికెళ్ళి మా అబ్బాయిని ఎత్తుకున్నాను.

'నాన్నా! అమ్మకి 'ఆయొచ్చింది' చూడమ్మా. ఎల్లావుందో అడుగు' అన్నాను మా చిట్టాడిని.

'అమ్మా! ఆయి' అన్నాడు మావాడు రెండుమార్లు.

రాజ్యం ఆనందం పట్టలేకపోయింది. కుఱ్ఱాడు నా చంకలో ఉండగానే వాడికి ఊపిరిసలుపకుండా ముద్దులవర్షం కురిపించేసి ఓరగా నాకేసి చూస్తో 'లేదురా మాచిట్టి తండ్రీ!' అంది.

'దొంగ తలనొప్పా!' అన్నాను నేను.

రాజ్యం మాటాడక ఊరికే నవ్వుతోంది.

'ఓహో! పిల్లాడిని ఎత్తుకోవడం లేదనా? అవును స్త్రీహృదయం తెలియడం కష్టమే. రేపటినుంచి యిరవైనాలుగుగంటలు అబ్బాయిని వదలిపెట్టనులే' అని మా అబ్బాయిని రాజ్యం ఒడిలో కూర్చోపెట్టాను.

—వేంకటశాస్త్రి.